

17న జిల్లాకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు రాక..

కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్థకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈ నెల 17న జిల్లాకు రానున్నారు. ఆ రోజు ఉదయం 9.30 గంటలకు విశాఖపట్నం విమానాశ్రయం నుంచి ర్యాలీగా బయలుదేరి.. ఎన్‌ఏడీ, మద్దిలపాలెం జాతీయరహదారి మీదుగా జిల్లాకు చేరుకుంటారు. భోగాపురం వద్ద భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2.30గంటలకు బయలుదేరి శ్రీకాకుళం సింహద్వారం, డేఅండ్‌నైట్ జంక్షన్, ఏడురోడ్ల జంక్షన్, సూర్యమహల్, అరసవల్లి జంక్షన్ మీదుగా రామ్మోహన్‌నాయుడు ఇంటివరకు ర్యాలీ సాగుతుంది. అక్కడ నుంచి సాయంత్రం 5గంటలకు ఎంపీ కార్యాలయం నుంచి సూర్యమహల్ జంక్షన్, రామలక్ష్మణ్ జంక్షన్, పెద్దపాడు మీదుగా నిమ్మాడకు చేరుకుంటుంది. ఈ వివరాలు టెక్కలి టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి విలేకరులకు తెలిపారు.

అచ్చెన్నకు వ్యవసాయం





- పశుసంవర్థకశాఖ కూడా కేటాయింపు
- వైసీపీ పాలనలో ఈ రంగాలు నిర్వీర్యం
- అనుబంధ శాఖలపైనా తీవ్రమైన నిర్లక్ష్యం
- అగమ్యగోచరంగా మార్కెటింగ్ శాఖ
- రైతుసేవలకు దూరంగా సహకార శాఖ
- కూటమికి అధికారంతో రైతుల్లో ఆశలు
- శాఖను గాడిన పెట్టాలని మంత్రికి విజ్ఞప్తి

జిల్లా వ్యవసాయాధారితం. ప్రజల్లో ఎక్కువ శాతం వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వ్యవసాయంతో పాటు అనుబంధ శాఖల తీరు మారడం లేదు. రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయశాఖను నిర్లక్ష్యం చేసింది. ప్రాజెక్టులు, కాలువలకు కనీస మరమ్మతులు లేక సాగునీటికి రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ ప్రోత్సాహం కూడా అంతంతమాత్రమే కావడంతో సాగుపై ఆసక్తి సన్నగిల్లింది. తాజాగా కూటమి ప్రభుత్వం కొలువుదీరడం.. జిల్లాకు చెందిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ కేటాయించడంతో కొన్నింటికైనా పరిష్కార మార్గం దొరుకుతుందన్న ఆశ జిల్లా ప్రజల్లో వ్యక్తమవుతోంది.

(రణస్థలం/టెక్కలి)

వైసీపీ పాలనలో నిరాదరణకు గురైన వ్యవసాయ రంగాన్ని.. మంత్రి హోదాలో కింజరాపు అచ్చెన్నాయుడు గాడిన పెట్టాలంటూ జిల్లా వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లాలో సుమారు నాలుగున్నర లక్షల చిన్న, సన్నకారు రైతులు, 30వేల మంది పెద్దరైతులు ఉన్నారు. జిల్లాలో ప్రధాన పంట వరి. సుమారు 4.50లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. మొక్కజొన్న 13,500 ఎకరాలు, వేరుశెనగ 1200 ఎకరాలు, పత్తి 2300 ఎకరాలు, చెరకు 2,200 ఎకరాలు, అపరాలు సుమారు 5వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఉద్దానం, ఏజెన్సీలో జీడి, మామిడి సాగు కూడా చేస్తున్నారు. కాగా ఆశించిన స్థాయిలో సాగు ప్రోత్సాహం దక్కడం లేదు. గత ఐదు సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ శాఖను పూర్తిగా నిర్వీర్యం చేసింది. సాగునీటి వనరులను సైతం అభివృద్ధి చేయలేదు. ఏటా ఖరీఫ్ ప్రణా ళికలో ఎడతెగని జాప్యమయ్యేది. రిజర్వాయర్లలో నీటి స్థిరీకరణ సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడేవారు. గొట్టాబ్యారేజీ, నారాయణపురం, తోటపల్లి, మడ్డువలస, బాహుదా, మహేంద్రతనయా ప్రధాన సాగునీటి వనరులు. ఇవి ఐదేళ్లుగా ఎటువంటి పనులకు నోచుకోలేదు. వంశధార ప్రధాన ఎడమకాలువ ఆధునికీకరణ చేపట్టలేదు. మదుములు, షట్టర్లు శిథిలావస్థకు చేరుకుని శివారు ప్రాంత రైతులు సాగునీరు అందక అవస్థలు పడుతూనే ఉన్నారు.

- టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 24 ఎత్తిపోతల పథకాలు మంజూరు చేసి.. 4.80లక్షల ఎకరాలకు సాగునీరందించారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో సగం భూములకు కూడా సాగునీరందని దుస్థితి నెలకొంది. రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయకపోవడంతో డీలర్ల వద్ద కొనుగోలు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. విత్తనాలు కూడా రైతులు అడిగినవి కాకుండా.. వ్యవసాయశాఖ మరో రకం పంపిణీ చేయడంతో డీలర్లను ఆశ్రయించారు. తెగుళ్ల నివారణకు సబ్సిడీపై పురుగు మందులు అందించలేదు. ధాన్యం విక్రయాల్లోనూ రైతులు అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో రైతులకు ప్రోత్సాహంతో పాటు సాగునీరు పుష్కలంగా అందించాల్సిన అవసరం కూటమి ప్రభుత్వంపై ఉంది.

● పాడిరైతులకూ గడ్డు పరిస్థితి..

జిల్లాలో ఐదేళ్ల పాటు పశుసంవర్థక శాఖ తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. పాడిరై తులకు గత మూడేళ్లుగా పశు నష్టపరిహారం రూ.12.20 కోట్లు చెల్లించాల్సి ఉంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో పశువులకు దాణా సబ్సిడీపై అందించే వారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సబ్సిడీపై పశుదాణా కనుమరు గైంది. పశుగ్రాస విత్తనాలు సరఫరాలోనూ వైసీపీ పాలకులు విఫలమయ్యారు. టీడీపీ హయాంలో పశువులకు సంబంధించి ప్రభుత్వం ఉచితంగా ఇన్స్యూరెన్స్ చేయించేది. వైసీపీ ప్రభుత్వం 30 శాతం పాడి పశువులకు ఇన్స్యూరెన్స్ చేయిం చి చేతులెత్తేసింది. పశువులకు వ్యాధి నివారణ టీకాలు కూడా వేయలేదు.

● మార్కెటింగ్ శాఖ నిర్వీర్యం..

జిల్లాలో మార్కెటింగ్ శాఖ నిర్వీర్యమవుతోంది. గతంలో ఆర్థిక పరిపుష్టితో వ్యవసాయ మార్కెట్ కమిటీలు కళకళలాడేవి. కానీ వైసీపీ పాలనలో ఆ పరిస్థితి లేదు. జిల్లాలో 11 ప్రధాన, ఆరు సబ్ మార్కెట్ యార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 43 గిడ్డంగులు ఉన్నాయి. అందులో పెద్దవి 9, చిన్నవి 34 ఉన్నాయి. కానీ గోదాములను వినియోగించే పౌరసరఫరాల శాఖ, గృహ నిర్మాణ శాఖ అద్దెలు సక్రమంగా చెల్లించడం లేదు. ఆ రెండు శాఖలే సుమారు రూ.2కోట్లు బకాయిలు పడినట్టు తెలుస్తోంది. మార్కెటింగ్ శాఖలో ఉద్యోగులు, సిబ్బందికి జీతాలు ఇచ్చేందుకు కూడా ఇబ్బంది నెలకొంది. గత ఐదేళ్లలో జిల్లాలో మార్కెటింగ్ శాఖకు సెస్ రూపంలో రూ.65కోట్ల ఆదాయం సమకూరింది. గోదాముల అద్దె రూపంలో మరికొంత ఆదాయం వచ్చింది. ఆదాయంలో నేరుగా 45 శాతం ప్రభుత్వానికి జమైంది. కానీ మార్కెటింగ్ శాఖ సిబ్బందికి మాత్రం సక్రమంగా జీతాలు చెల్లించలేదు.

● 'సహకారం' సున్నా..

జిల్లాలో సహకార సంఘాల పరిస్థితి అలానే ఉంది. సహకార రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నా.. జిల్లాలో మాత్రం ఆ పరిస్థితి కని పించడం లేదు. పైగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు రైతు సేవ కంటే వాణిజ్య ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్నాయన్న విమర్శ ఉంది. జిల్లా లో చాలా పీఏసీఎస్‌లకు సొంతగూడు లేక.. అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. రైతులు పండించే పంటలను ధర వచ్చే వరకూ నిల్వ చేయడం వీటి ప్రధాన విధి. కానీ జిల్లాలో అటువంటిదేమీ కనిపించడం లేదు. జిల్లాలో 57 చోట్ల గొడౌన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఒక్కో దాని నిర్మాణానికి రూ. 40 లక్షలు కేటాయించారు. మొత్తం రూ.23 కోట్ల అంచనా వ్యయంతో వీటి నిర్మాణాలు ప్రారంభించారు. కానీ ఎనిమిది చోట్ల మాత్రమే పూర్తయ్యాయి. దీనికితో డు గత ఐదేళ్లుగా రైతుభరోసా కేంద్రాల పేరు చెప్పి.. ప్రాథమిక వ్యవసాయ పరపతి సేవా సంఘాల సేవలను పూర్తిగా తొక్కిపెట్టారు. వ్యవసాయశాఖ మంత్రిగా అచ్చెన్నాయుడు.. తమకు మెరుగైన సేవలందించేలా చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అత్యంత ప్రాధాన్యం

● అచ్చెన్నకు కీలక విభాగాల కేటాయింపుపై సర్వత్రా హర్షం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్థక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్యశాఖలను కేటాయించారు. దీంతో అటు అచ్చెన్నాయుడుతోపాటు జిల్లా ప్రజల్లోనూ ఆనందానికి అవధుల్లేవు. కీలకమైన వ్యవసాయశాఖను ఇంతవరకూ జిల్లాలో ఎవరికీ కేటాయించలేదు. 2014లో రాష్ట్ర రవాణాశాఖ, కార్మికశాఖ మంత్రిగా అచ్చెన్న వ్యవహరించారు. తాజాగా టీడీపీ అధినేత చంద్రబాబు రెండోసారి మంత్రిగా అచ్చెన్నకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు.

● జిల్లాకు అన్ని విధాలా మేలు..

సిక్కోలు.. రాష్ట్రంలో వెనుకబడిన జిల్లా. ఇక్కడి ప్రజల తలసరి ఆదాయం కూడాను అత్యల్పమే. వ్యవసాయ కూలీలు అధికంగా ఉన్నారు. వ్యవసాయంతోనే ఆధారపడిన కుటుంబాలు కోకొల్లలు. వైసీపీ ప్రభుత్వం.. వ్యవసాయరంగాన్ని నిర్వీర్యం చేసేసింది. కనీసం ఐదేళ్లకాలంలో వ్యవసాయశాఖ మంత్రి పేరుకూడా జిల్లా ప్రజలకు తెలియని పరిస్థితి. ఇప్పుడు అటువంటి పరిస్థితి ఉండదు. జిల్లాపై పూర్తిగా పట్టున్న వ్యక్తి అచ్చెన్నాయుడు. సాగుకోసం రైతులకు అవసరమైన ప్రభుత్వ సహకారం అందించగల సమర్థుడనే నమ్మకం జిల్లావాసుల్లో నెలకొంది. అలాగే వైసీపీ పాలనలో పశుసంవర్థకశాఖ, మత్స్యశాఖ మంత్రిగా సీదిరి అప్పలరాజు.. ప్రతిపక్షంపై విమర్శలు.. అక్రమాలే తప్ప.. రైతులకు, మత్స్యకారులకు ఉపయోగపడే కార్యక్రమాలు ఒక్కటీ చేపట్టలేదు. ఇప్పుడు అనుభవం కలిగిన అచ్చెన్నకు వ్యవసాయ శాఖతో పాటు వాటికి అనుబంధంగా పశుసంవర్థక, మత్స్యశాఖ, మార్కెటింగ్, కోఆపరేటివ్ శాఖలు కేటాయించడంతో హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో సుదీర్ఘప్రాంతంలో అత్యధికంగా ఉన్న మత్స్యకారులకు మేలు జరుగుతుందని ఆయా వర్గాలవారు భావిస్తున్నారు.

మరింత సేవ చేస్తా

జిల్లాతోపాటు రాష్ట్ర ప్రజలందరికీ సేవ చేసేందుకు మంచి శాఖ లభించింది. వ్యవసాయ రంగం అత్యంత కీలకం. వాటి అనుబంధ రంగాలు కూడా ఈ శాఖలో ఉన్నాయి. రైతులకు, మత్స్యకారులకు, ప్రజలకు మేలు చేసేందుకు నిరంతరం శ్రమిస్తాను. జిల్లాతోపాటుగా రాష్ట్ర ప్రజలకు ప్రయోజనం కలిగేలా మరింత బాధ్యతగా పనిచేస్తాను. ప్రభుత్వం నుంచి అన్నివిధాలా సహకారం అందిస్తాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా వ్యవసాయ రంగంపై ప్రత్యేకశ్రద్ధ చూపుతారు.

- అచ్చెన్నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి

కువైట్ నుంచి స్వగ్రామానికి..

- తీసుకురానున్న లోకనాథం మృతదేహం
- జింకిభద్రలో విషాదఛాయలు



లోకనాథం(ఫైల్)

సోంపేట, జూన్ 14: సోంపేట మండలం జింకిభద్రకు చెందిన తామాడ లోకనాథం(31) మృతదేహం శనివారం ఉదయం స్వగ్రామానికి చేరుకోనుంది. ఉపాధి కోసం కువైట్ వెళ్లిన లోకనాథం.. బుధవారం తెల్లవారు జామున అక్కడ అగ్ని ప్రమాదంలో చిక్కుకుని మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా.. ప్రభుత్వ ఆధ్వర్యంలో లోకనాథం మృతదేహాన్ని కువైట్ నుంచి డిల్లీకి.. అక్కడి నుంచి విశాఖపట్నానికి విమానంలో తీసుకువచ్చారు. విశాఖ నుంచి తహసీల్దార్‌తో పాటు గ్రామపెద్ద చంద్రశేఖర్ ప్రత్యేక వాహనంలో స్వగ్రామానికి తెచ్చేలా ఏర్పాట్లు చేశారు. నేడు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు.

పెళ్లికోసం.. మళ్లీవస్తానని..

జింకిభద్రకు చెందిన చిరంజీవులు, నారాయణమ్మ దంపతులకు లోకనాథం ఒక్కడే కుమారుడు. ఇద్దరు కుమార్తెలు. వారికి వివాహాలయ్యాయి. లోకనాథం కోసం సంబంధాలు చూస్తున్నారు. ఇటీవల గ్రామ దేవత సంబరాలు, ఎన్నికల నేపథ్యంలో కువైట్ నుంచి స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులతో సరదాగా గడిపాడు. ప్రస్తుతం ముహూర్తాలు లేకపోవడంతో 2025 జనవరిలో మళ్లీ వస్తానని.. సంబంధం కుదిరితే పెళ్లి చేసుకుంటానని కుటుంబ సభ్యులకు చెప్పి.. ఈ నెల 8న కువైట్‌కు తిరిగి పయనమయ్యాడు. హైదరాబాద్‌లో ఈ నెల 11న విమానం ఎక్కి.. ఆ రోజు రాత్రి కువైట్ తను పనిచేస్తున్న కార్యాలయానికి చేరుకుని పడుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరగడంతో మంటల్లో చిక్కుకుని నిద్రలోనే మృతి చెందాడు. ఈ వార్త కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఒక్కరోజైనా ఆలస్యంగా వెళ్లి ఉంటే తమ కుమారుడు బతికే ఉండేవాడని తల్లిదండ్రులు రోదిస్తున్నారు.

జలవనరుల విభాగంలో ప్రక్షాళన

- వంశధార ప్రాజెక్టు ఎస్ఈగా రాంబాబు
- విశాఖకు తిరుమలరావు బదిలీ
- టెక్కలిలో డీఈఈ కూడా..

శ్రీకాకుళం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వైసీపీ పాలనలో జలవనరుల శాఖను పర్యవేక్షించినవారు కరువయ్యారు. అధికారులు కేవలం జిల్లాపరిషత్ సమీక్షలకు హాజరై.. మమ అనిపించేసేవారు. వైసీపీ ప్రజాప్రతినిధులకు అనుకూలంగా కొంతమంది అధికారులు వ్యవహరించారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో.. అటువంటి వారిని ప్రక్షాళన చేపడుతున్నారు. ఇందులో భాగంగా బీఆర్ఆర్ వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోల తిరుమలరావును విశాఖకు పంపుతూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. విశాఖపట్నం క్వాలిటీ కంట్రోల్ విభా గంలో ఈఈగా విధులు నిర్వహిస్తూ.. వైసీపీ ప్రభుత్వంలో పూర్తి అదనపు బాధ్యతలతో వంశధార ఎస్ఈగా తిరుమలరావు నియమితులయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం ఆయనను తప్పించి.. ఏపీఐఎల్ఐపీ, విజయవాడ విభాగంలో విధులు నిర్వహిస్తున్న సూపరింటెండెంట్ ఇంజనీర్ బి.రాంబాబును నియమించింది. టీడీపీ హయాంలో 2014లో జిల్లాలో రాంబాబు విధులు నిర్వహించారు. ఆతర్వాత బదిలీపై ఇక్కడ నుంచి వెళ్లిపోయారు.

ఇక టెక్కలిలో వంశధార ప్రాజెక్టు డీఈఈ కె.శ్రీకాంత్‌ను ఇక్కడ నుంచి బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయవాడ నుంచి బి.శేఖరరావును నియమించారు. ఈయన కూడా తక్షణమే విధుల్లో చేరాలని.. ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. జలవనరుల శాఖలో ప్రక్షాళన ఆరంభమైందని.. ఇదేరీతిలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ, గ్రామీణ నీటిసరఫరా శాఖలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ షకీలా



అరసవల్లి, జూన్ 14: శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ డి.షకీలా(హెచ్ఓడీ ఫిజియాలజీ, రిమ్స్) నియమితులయ్యారు. ఆమెకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

సెలవుపై డీఎంహెచ్‌వో

జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి బొడ్డేపల్లి మీనాక్షి ఐదు రోజుల పాటు సెలవు పెట్టారు. ఆమె కుటుంబ సభ్యురాలి అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లినట్టు తెలుస్తోంది. ఆమె స్థానంలో అడిషనల్ డీఎంహెచ్‌వో ఎం.ప్రసాదరావు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.



టెక్కలి: భగవాన్‌పురంలో ట్రాక్టర్‌పై పడిన చెట్టు



టెక్కలిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

చెట్టు కూలి.. రైతు మృతి

- పెనసాంలో విషాదం



రమణ (ఫైల్)

జి.సిగడాం, జూన్ 14: జి.సిగడాం మండలం శేతుభీమవరం పంచాయతీ పెనసాంలో చెట్టు కూలి గ్రామానికి చెందిన రైతు గేదెల రమణ(39) మృతి చెందాడు. శుక్రవారం మధ్యాహ్నం పొలం నుంచి పశువులను తీసుకువస్తుండగా.. గాలివాన బీభత్సంతో తంగిటి చెట్టు కూలి.. ఆయనపై పడింది. వెంటనే స్థానికులు వెళ్లి ఆయనను రక్షించే ప్రయత్నం చేశారు. 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో రమణ మృతి చెందాడని సిబ్బంది నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు అంకమ్మ, రామా రావు, భార్య సింహాచలం, కుమార్తె జ్ఞానేశ్వరి రోదించారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. జి.సిగడాం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. శవ పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శనివారం రాజాం సామాజిక అసుపత్రికి తరలించనున్నారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వై.మధుసూదన రావు తెలిపారు.



రమణ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గాలివాన బీభత్సం

(ఆంధ్రజ్యోతి బృందం)

జిల్లాలో శుక్రవారం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పిడుగుల శబ్దాల మోత మోగింది. ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. శుక్రవారం ఉదయం ఎండ తీవ్రతో ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం 3.30 గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మబ్బులు కమ్ముకుని టెక్కలి, జి.సిగడాం, పొందూరు, నందిగాం తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. టెక్కలి మండల పరిధిలో ఈదురుగాలుల బీభత్సానికి 26 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. భగవాన్‌పురంలో ట్రాక్టర్‌పై చెట్టు పడింది.



పొందూరు : పాఠశాల ఆవరణలో చేరిన వర్షపు నీరు

'ఏకలవ్య'పై నిర్లక్ష్యం

- పాఠశాల భవనం పనులను పూర్తిచేయని వైసీపీ సర్కారు
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

(మెళియాపుట్టి)


మెళియాపుట్టిలోని ఏకలవ్య పాఠశాల భవనం పనులను పూర్తి చేయడంలో గత వైసీపీ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల పాలనలో భవన నిర్మాణాన్ని పూర్తి చేయలేకపోయింది. దీంతో విద్యార్థులకు సొంత భవనం కరువైంది. పాతపట్నంలోని వైటీసీ భవనంలో అరకొర సౌకర్యాల నడుమ చదువులు సాగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో తమ పాఠశాల భవనం పూర్తవుతుందని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో నిరుపేద విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏకలవ్య పాఠశాలలను తీసుకొచ్చింది. 2018-2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి పీవో శివశంకర్ ప్రతిపాదనల మేరకు మెళియాపుట్టి మండలానికి ఏకలవ్య పాఠశాల మంజూరైంది. వాస్తవానికి ఈ పాఠశాలను పార్వతీపురం మన్యం జిల్లా భామిని (గతంలో శ్రీకాకుళం జిల్లా) మండలానికి కేటాయించారు. అయితే అప్పటి మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పట్టుబట్టి మెళియాపుట్టికి తీసుకువచ్చారు. మెళియాపుట్టికి ఆనుకొని ఉన్న కొండ ప్రాంతంలోని ఉల్లాస పేట వద్ద భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే, 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పాఠశాల భవనం పనులను పూర్తి చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేసింది. దీంతో పాతపట్నం మండలంలోని వైటీసీ భవనంలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 336 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది ఇంటర్ ఫస్టియర్‌లో మరో 90 మంది విద్యార్థులు చేరారు. ప్రతి తరగతిలోని విద్యార్థులను రెండు విభాగాలుగా విభజించారు. దీంతో 14 గదులు అవసరం. కానీ, ప్రస్తుతం పాతపట్నంలోని వైటీసీ భవనంలో అరకొర గదులే ఉండడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత ఏడాది ఏకలవ్య పాఠశాల భవనం పనుల పరిశీలనకు గిరిజనశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీతో పాటు జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు వచ్చారు. పనులను పూర్తి చేయకపోవడంపై కాంట్రాక్టర్‌తో పాటు ఇంజనీరింగ్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం నాటికైనా మెళియాపుట్టిలోని నూతన భవనాల్లో తరగతులు ప్రారంభించాలని ఆదేశించినా పనులు మాత్రం పూర్తికాలేదు. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, బాలిక వసతి గృహాలు, ప్రహరీ, తదితర పనులు పూర్తికాకపోవడంతో ఈ ఏడాది కూడా పాత భవనంలోనే చదువులు సాగించాలా? అని విద్యార్థులు మదనపడుతున్నారు. అయితే, కూటమి ప్రభుత్వం ఈ కొత్త భవనం పనులు పూర్తిచేసి తమ ఇబ్బందులు తొలగించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపల్ రాధాకృష్ణ వివరణ కోరగా.. రెండు నెలల్లో భవనం పనులు పూర్తి చేసి తమకు అప్పగిస్తామని అధికారులు చెప్పారని తెలిపారు.



పూర్తికాని ఏకలవ్య పాఠశాల భవనం

పవర్‌ఫుల్ పాత్రలో...

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'విశ్వంభర'. త్రిషకృష్ణన్, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తుండగా, విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇందులో కీలక పాత్ర పోషిస్తున్న బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్ శుక్రవారం సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఇందులో ఆయన చాలా పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తున్నారని మేకర్స్ తెలిపారు. సంక్రాంతి కానుకగా ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. ఈ చిత్రానికి డీఓపీ: ఛోటా. కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి.





పరమేశ్వరుని ఆజ్ఞతోనే కన్నప్ప తీశాం

మంచు మోహన్‌బాబు

"కన్నప్ప కథ అన్ని తరాలను ఆకట్టుకుంటుంది. పరమేశ్వరుడు ఇచ్చిన ఆజ్ఞతోనే 'కన్నప్ప' చిత్రం తీశాం. ప్రభాస్ కోసం రాసుకున్న కథను కృష్ణంరాజు గారు మేం అడగ్గానే ఇచ్చి, ప్రోత్సహించారు. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఇది కేవలం భక్తి చిత్రమే కాదు ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలూ ఉన్నాయి' అని మంచు మోహన్‌బాబు అన్నారు. విష్ణు మంచు టైటిల్ పాత్ర పోషిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప'. ముఖేశ్ కుమార్ దర్శకత్వంలో డాక్టర్ మంచు మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. శుక్రవారం చిత్రబృందం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ '2014లో 'కన్నప్ప' సినిమా తీయాలని నిశ్చయించుకున్నాను. అంతా సిద్ధం చేసి పెట్టుకున్నాను. ఇప్పుడు సినిమా తీసి మీ ముందుకు తీసుకొస్తున్నాం. కన్నప్పది కల్పిత గాథ కాదు. రెండో శతాబ్దంలో జరిగిన ఘటన. శంకరాచార్యుల వారు కూడా కన్నప్ప గురించి చెప్పారు. 14వ శతాబ్దంలో ధూర్జటి కన్నప్ప గురించి రాశారు. 18వ శతాబ్దంలో కన్నప్ప గురించి బ్రిటీషర్లు రాసిన పుస్తకం బికనీర్ యూనివర్శిటీలో ఉంది. దాని ఆధారంగానే జాగ్రత్తగా సినిమా తీశాం. ఇకపై ప్రతి సోమవారం కన్నప్ప చిత్రం నుంచి అప్‌డేట్ వస్తుంది. బడ్జెట్ గురించి ఆలోచించలేదు. చరిత్రలో నిలిచిపోయే సినిమా తీస్తున్నామని ధైర్యంగా ముందుకెళ్లాం' అని చెప్పారు.

జైలు నుంచి హేమ విడుదల



బెంగళూరు రేవ్‌పార్టీ కేసులో అరెస్టయి పరప్పన అగ్రహార జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న సినీ నటి హేమ శుక్రవారం విడుదలయ్యారు. బుధవారం ఎన్‌డీపీఎస్ ప్రత్యేక కోర్టు హేమకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గురువారం బెయిల్‌లో సూచించిన నిబంధనలకు అనుగుణంగా పూర్తి ప్రక్రియ సాగింది. శుక్రవారం అన్ని షరతులకు లోబడి పత్రాలు సమర్పించడంతో హేమను విడుదల చేశారు.

ఊరి గొడవల్లో కుర్రోళ్ల మజా



సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. నిహారిక కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించారు. యదువంశీ దర్శకుడు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. శుక్రవారం హీరో నితిన్ ఈ చిత్రం టీజర్‌ను సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఊరి గొడవల్లో తలదూర్చిన యువబృందం ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవాల్సి వచ్చింది అనే నేపథ్యంలో స్నేహం, ప్రేమ, భావోద్వేగాల కలయికగా సాగిన టీజర్ ఆసక్తికరంగా అనిపించింది. సాయికుమార్ కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి సంగీతం: అనుదీప్ దేవ్. సినిమాటోగ్రఫీ: రాజు ఎడురోలు

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/TmE38l7లో చదవండి.

నా కోరిక తీరింది



చైతన్యరావు, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. ఈ రొమాంటిక్ కామెడీకి బాల శేఖరుని దర్శకత్వం వహించగా, కే.కే.ఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో చైతన్య రావు మాట్లాడుతూ "ప్రతి నటుడికీ అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న క్యారెక్టర్ చేయాలనే కోరిక ఉంటుంది. ఈ సినిమా ద్వారా నాకు ఆ కోరిక తీరింది" అని అన్నారు. "అన్ని వర్గాల ప్రేక్షకులకి సినిమా కనెక్ట్ అవుతుంది" అని దర్శకుడు బాలశేఖరుని చెప్పారు. "థియేటర్స్‌లో ప్రేక్షకులని ఆకట్టుకునేది కంటెంట్ మాత్రమే. ఆ మంచి కంటెంట్ ఇందులో ఉంది" అని హెబ్బా పటేల్ అన్నారు.

దిక్సూచి DIKSUCHI

నిమ్స్‌లో పీహెచ్‌డీ



హైదరాబాద్-పంజాగుట్టలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)-పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 26 సీట్లు ఉన్నాయి. నిమ్స్ ఎంట్రెన్స్ టెస్ట్, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఇది మూడేళ్ల వ్యవధిగల ఫుల్ టైం ప్రోగ్రామ్. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయవచ్చు. డాక్టోరల్ కమిటీ అనుమతి మేరకు మరో మూడేళ్లు పొడిగించే వీలుంది. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు; పబ్లిక్ సెక్టార్ సంస్థలు/యూనివర్సిటీలు/ఇతర ఇన్‌స్టిట్యూషన్‌లకు చెందిన ఉద్యోగులు అడ్మిషన్ నాటికి సంబంధిత సంస్థ నుంచి 'నో అబ్జెక్షన్' సర్టిఫికెట్‌ను సబ్మిట్ చేయాలి. ప్రోగ్రామ్ సమయంలో ఇతర డిగ్రీలు/డిప్లొమాలు చేసేందుకు అనుమతించరు.

విభాగాలు-సీట్లు: బయోకెమిస్ట్రీ 3, క్లినికల్ ఫార్మకాలజీ అండ్ థెరపిటిక్స్ 1, ఎమర్జెన్సీ మెడిసిన్ 1, మెడికల్ జెనెటిక్స్ 4, మెడికల్ అంకాలజీ 2, మైక్రోబయాలజీ 5, న్యూరాలజీ 1, నెఫ్రాలజీ 6, పాథాలజీ 1, ఫిజియోథెరపీ 2.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ(లైఫ్ సైన్సెస్/అలైడ్ మెడికల్ సైన్సెస్) ఉత్తీర్ణులు; కనీసం 55 శాతం మార్కులతో ఎంబీబీఎస్/ బీడీఎస్ ఉత్తీర్ణతతోపాటు ఏడాది రీసెర్చ్ అనుభవం ఉన్నవారు; నాలుగేళ్ల బ్యాచిలర్ డిగ్రీతోపాటు రీసెర్చ్ అనుభవం ఉన్నవారు; ఎన్ఎంసీ/డీఎన్‌బీ నుంచి ఎండీ/ఎంఎస్ ఉత్తీర్ణులు; ఎంటెక్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్/డేటా సైన్స్/మెషిన్ లెర్నింగ్/బయోటెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ జేఆర్ఎఫ్, ఐసీఎంఆర్-జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్, డీబీటీ జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్, ఇన్‌స్పయిర్ ఫెలోషిప్ అర్హతల్లో ఒకటి ఉన్నవారు ఎంట్రెన్స్ టెస్ట్ రాయనవసరం లేదు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: పరీక్ష 50 మార్కులకు ఉంటుంది. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో జనరల్ ఆప్టిట్యూడ్, రీసెర్చ్ మెథడాలజీ, బయో స్టాటిస్టిక్స్, ఎథిక్స్ అంశాల నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు. ఇది అన్ని విభాగాల వారికి కామన్‌గా ఉంటుంది. రెండో పార్ట్‌లో అభ్యర్థులు హ్యూమన్ అనాటమీ, హ్యూమన్ ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ, సెల్ బయాలజీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, జెనెటిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఫార్మకాలజీ విభాగాల నుంచి మూడింటిని ఎంచుకోవాల్సి ఉంటుంది. అభ్యర్థి ఎంచుకొన్న విభాగాల నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు ఓఎంఆర్ పత్రం మీద సమాధానాలు గుర్తించాలి. పరీక్ష సమయం గంట. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. వీరిని మాత్రమే ఇంటర్వ్యూకి అనుమతిస్తారు. తరవాత మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2000
- **మెడికల్ ఎగ్జామినేషన్ ఫీజు:** రూ.4050
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 27
- **నిమ్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూలై 13
- **వెబ్‌సైట్:** www.nims.edu.in

ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీలో డిప్లొమా

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ- 'డిప్లొమా ఇన్ ఫిషరీస్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ పొందవచ్చు. ప్రభుత్వ కళాశాలల్లో 55 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 440 సీట్లు ఉన్నాయి. 75 శాతం సీట్లను కనీసం నాలుగేళ్లు గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ప్రత్యేకించారు. 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పదోతరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: ఎస్ఎస్‌సీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ నుంచి 2024 మార్చిలో పదోతరగతి పరీక్షలు రాసి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్ఐఓఎస్, ఏపీఓఎస్ఎస్, టీఓఎస్ఎస్ అభ్యర్థులు; కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/ మధ్యలో ఆపేసినవారు కూడా అర్హులే. ఇంటర్/ తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తుకు అనర్హులు. 2024 ఆగస్టు 31 నాటికి అభ్యర్థుల వయసు 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 6
- **వెబ్‌సైట్:** apfu.ap.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/c2lwxdNలో చదవండి.

ఎయిమ్స్ రిషికేశ్‌లో ఎమ్మెస్సీ

రిషికేశ్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- ఎమ్మెస్సీ 2024 ఆగస్టు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు-సీట్లు

- మెడికల్ బయోకెమిస్ట్రీ 7, మెడికల్ ఫిజియాలజీ 2, మెడికల్ ఫార్మకాలజీ 2, పెర్ఫ్యూజన్ టెక్నాలజీ 2 సీట్లు ఉన్నాయి.
- మెడికల్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఎమ్మెస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు.

అర్హత: ఎమ్మెస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌నకు బీఎస్సీ(పెర్ఫ్యూజన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. మిగిలిన మెడికల్ ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లకు ఎంబీబీఎస్/బీడీఎస్/బీవీఎస్సీ/బీఫార్మసీ/నాలుగున్నరేళ్ల బీపీటీ/మూడేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి.

రిటెన్ టెస్ట్: పరీక్ష సమయం మూడు గంటలు. అభ్యర్థి ఎంచుకున్న స్పెషలైజేషన్‌కు సంబంధించిన సబ్జెక్ట్ నుంచి 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 200. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 50 శాతం పర్సెంటైల్ రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,000; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1600; దివ్యాంగులకు ఫీజు లేదు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 28
- **వెబ్‌సైట్:** www.aiimsrishikesh.edu.in

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)- 'డిప్లొమా ఇన్ ఆఫీస్ ఆటొమేషన్ అండ్ అసిస్టివ్ టెక్నాలజీ(డీఓఏఏటీ)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని పర్సన్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీ, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్, మెంటల్ ఇల్‌నెస్, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజెబిలిటీ, మల్టిపుల్ డిజెబిలిటీస్ కేటగిరీలకు ప్రత్యేకించారు. దీనికి తిరుచిరాపల్లిలోని భారతీదాసన్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. చెన్నై క్యాంపస్‌లో స్టడీ సెంటర్ ఉంది.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: పరీక్ష సమయం 45 నిమిషాలు. ఇందులో కంప్యూటర్ నాలెడ్జ్, మేథమెటిక్స్, జనరల్ నాలెడ్జ్ అంశాలకు సంబంధించి మొత్తం 30 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 30. నెగెటివ్ మార్కులు లేవు. మోడల్ ప్రశ్న పత్రాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 15
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, అభ్యర్థి ఫొటో, కమ్యూనిటీ సర్టిఫికెట్, డిజెబిలిటీ సర్టిఫికెట్
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

నీలిట్‌లో ఎంటెక్

గోరఖ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)-ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎలక్ట్రానిక్స్ డిజైన్ అండ్ టెక్నాలజీ, వీఎల్ఎస్ఐ డిజైన్ స్పెషలైజేషన్‌లలో ఈ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 18 సీట్లు ఉన్నాయి. ఇన్‌స్టిట్యూట్ లెవెల్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారికి నేరుగా ప్రవేశాలు కల్పిస్తారు. గేట్ అభ్యర్థులకు ఏఐసీటీఈ నుంచి పీజీ స్కాలర్‌షిప్ లభిస్తుంది. నాన్ గేట్ అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ స్కీం కింద సంస్థ స్టయిపెండ్ చెల్లిస్తుంది.

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో (బీఈ/బీటెక్)(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంట్రెన్స్ టెస్ట్: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీ) కోడ్ పేపర్‌కు నిర్దేశించిన గేట్ సిలబస్ ఆధారంగా పరీక్ష నిర్వహిస్తారు. ఈ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 19
- **కౌన్సెలింగ్:** జూన్ 20
- **వెబ్‌సైట్:** nielit.gov.in

జాబ్ కార్నర్

ఎస్‌బీఐలో ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), సెంట్రల్ రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్... రెగ్యులర్ ప్రాతిపదికన ట్రేడ్ ఫైనాన్స్ ఆఫీసర్(ఎంఎంజీఎస్-2)- మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-2 (150) భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఏదైనా విభాగంలో డిగ్రీ, ఐఐబీఎఫ్ ఫారెక్స్ సర్టిఫికేట్‌తో పాటు ట్రేడ్ ఫైనాన్స్ ప్రాసెసింగ్‌లో రెండేళ్ల పని అనుభవం ఉండాలి.

పోస్టింగ్: హైదరాబాద్, కోల్‌కతా
దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 27
వెబ్‌సైట్: https://sbi.co.in/

ఎన్ఎఫ్‌సీలో మెడికల్ ఆఫీసర్లు

హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్.. అడ్‌హాక్ ప్రాతిపదికన 3 జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి
వయోపరిమితి: 50 ఏళ్లు మించకూడదు
ఇంటర్వ్యూ తేదీ: జూన్ 24
వేదిక: ఎన్ఎఫ్‌సీ గెస్ట్‌హౌస్(గురుకుల్), న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, ఈసీఐఎల్ ఫ్యాక్టరీ దగ్గర, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://nfc.gov.in/

జిల్లాలో భారీ వర్షం

- టెక్కలిలో గాలీ వాన బీభత్సం
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- గ్రామీణ ప్రాంతాల్లో రాత్రంతా అంధకారం
- ఇతర ప్రాంతాల్లోనూ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, భారీవర్షం

టెక్కలి, జూన్ 14: జిల్లాలో పలు ప్రాంతాల్లో శుక్రవారం వాతావరణంలో ఒక్కసారి మార్పు సంభవించి ఉరుములు, మెరుపులు, పిడుగుల శబ్దాలకు ప్రజలు భయాందోళన చెందారు. గడచిన కొన్ని రోజులుగా వర్షాలు కురియకపోవడం, ఎండల తీవ్రత ఎక్కువగా ఉండగా శుక్రవారం కురిసిన భారీ వర్షం కొంతమేర ప్రజలకు ఉపశమనం కలిగించింది. అయితే టెక్కలిలో భారీగా ఉరుములు, మెరుపులు, ఈదురుగులు, పిడుగుల శబ్దాలకు చిన్నారులు, వృద్ధులు భయాందోళనకు గురయ్యారు. ఈదురు గాలులు భీభత్సంతో తొలుసూరుపల్లి, ఎన్టీఆర్ కాలనీ, గంగాధరపేట, వీఆర్‌కేపురం, బన్నువాడ తదితర ప్రాంతాల్లో సుమారు 26 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అరటి, మునగ వంటి చెట్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. బన్నువాడలో విద్యుత్ వైర్లు సైతం తెగిపడ్డాయి. ఈ భీతావహ వాతావరణంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడిపారు. ఆ గంటసేపు టెక్కలికి ఏమైందనే పరిస్థితి ప్రజల్లో ఆందోళన నెలకొంది. భారీ వర్షంతో పట్టణంలో రోడ్లు వర్షపునీటితో నిండిపోయి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులకు గురయ్యారు. భగవాన్‌పురంలో ట్రాక్టర్‌పై చెట్టు పడిఒక్క సారిగా పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఉలిక్కి పడ్డారు. దీంతో టెక్కలి- చెట్ల తాండ్ర, ఆరికివలస, డీజీపురం తదితర గ్రామాలకు వెళ్లిన మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నర్సింగపల్లి, బన్నువాడ, గూడెం, ముఖలింగాపురం, రాంపురం తదితర గ్రామాల్లో మధ్యాహ్నం పోయిన విద్యుత్‌ను పునరుద్ధరించకపోవడంతో రాత్రంతా అంధకారంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

చల్లబడ్డ వాతావరణం

నందిగాం: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులు భయంగొల్పాయి. ఒక్కసారి ఆకాశం మేఘావృతమై సుమారు అరగంట పాటు ఉరుములు, మెరుపులతో పాటు భారీ వర్షం కురిసింది. గడచిన కొన్ని రోజులుగా వర్షాలు లేక ఎండ తీవ్రతకు అల్లాడిన ప్రజలు ఒక్కసారి వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. పలుచోట్ల


టెక్కలిలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఈదురుగాలులు, వడగళ్ల వాన పడడంతో విద్యుత్ సరఫరాకు కొంతమేర అంతరాయం కలిగింది.

భారీ వర్షం.. రైతుల హర్షం

జి.సిగడాం: మండలంలో శుక్రవారం ఉరుములు, మెరుపులు, ఈదుడుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గంట కాలం పాటు ఎడతెరిపిలేని వర్షం కురవడంతో పంట పొలాలో నీరు చేరి చెరువులను తలిపిస్తున్నాయి. వారం రోజుల కిందట వేసిన మొక్క జొన్న విత్తనాలకు


నందిగాంలో కురుస్తున్న వర్షం


జి.సిగడాం: పంట పొలాల్లో చేరిన వర్షపు నీరు

ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు కూడా ఈ వర్షం అనువైనదంటున్నారు.

ఊరటనిచ్చిన భారీ వర్షం

పొందూరు: మూడురోజులుగా తీవ్రమైన ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న మండల వాసులకు శుక్రవారం సాయంత్రం గంటపాటు కురిసిన భారీ వర్షం ఊరటనిచ్చింది. సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నల్లటి మబ్బులు కమ్ముకోవడంతోపాటు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గంటపాటు ఏకదాటిగా వర్షం కురవడంతో మండల కేంద్రంలోని వీధులు, పాఠశాలల ఆవరణ చెరువును తలపించాయి.


పంట పొలాల్లో చేరిన నీరు

కార్పొరేట్ పాఠశాల పాఠ్యపుస్తకాల గదికి తాళం

టెక్కలి: టెక్కలి పాత హైవేపై ఉన్న ఓ కార్పొరేట్ పాఠశాలలో పుస్తకాలను అధిక ధరలకు అమ్ముతున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు, ఏబీవీపీ నేతల ఫిర్యాదు మేరకు ఎంఈవోలు శుక్రవారం ఆ పాఠశాలను సందర్శించి పాఠ్యపుస్తకాల గదులకు తాళం వేశారు. ఎంఈవోలు అధిక ధరలకు అమ్ము తున్నారన్న విషయాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు కొన్ని మురళి, మదన్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

జీడి పిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

పలాసరూరల్: జీడిపిక్కలకు మద్దతు ధర ప్రకటించి 80 కిలోల బస్తాకు రూ.16 వేలకు కొనుగోలు చేయాలని నియోజకవర్గ రైతాంగ సమస్యల సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురుదాసుపురం,రంగోయి, చినగురుదాసుపురం, నీలావతి, బొడ్డపాడు, మామిడిపల్లి గ్రామాల్లో శుక్రవారం వారంతా పర్యటించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేయాలని, కొత్త ప్రభుత్వం హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మామిడి మాధవరావు, కార్యదర్శి గొర్లె చలపతి, దాసరి శ్రీరాములు, బి.సింహాద్రి, పుచ్చ దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై హర్షం

హరిపురం: రైతుల పాలిట గుదిబండగా తయారైన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును సీఎం చంద్ర బాబు రద్దు చేయడంపై మందస మండల రైతు సంఘం నాయకులు బెస్త కామేశ్వరరావు, మామిడి మాధవరావు, కొర్ల హేమారావు చౌదరి, నల్ల హడ్డీ తదితరులు హర్షం వ్యక్తంచేశారు. కేంద్రం పేరు చెప్పి వైసీపీ ప్రభుత్వం యాక్టును పూర్తిగా మార్చి రైతులపాలిట యమగుండంగా మార్చిందని, దీనిని రద్దు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు అమలు చేయడం హర్షణీయమన్నారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అని, రైతుల పక్షాన నిలిచి ఆదుకొనే చర్యలు కొనసాగించాలని కోరారు. హర్షం వ్యక్తంచేసిన వారిలో శ్రీరాములు, బి.గున్నయ్య, ముకుందరావు తదితరులున్నారు.

వారం రోజులుగా నిలిచిన సచివాలయ సేవలు

పాతపట్నం: గడచిన వారం రోజులుగా సచివాలయ సేవలు అందడం లేదని కాగువాడ గ్రామ స్థులు తెలిపారు. వివిధ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు వెళితే కంప్యూటర్లు పనిచేయడం లేదని సిబ్బంది తెలుపుతుండడంతో వెనుదిరగాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి కార్యాలయంలో వర్షపు నీరు చేరడంతో సాంకేతిక లోపాలేర్పడ్డాయని సిబ్బంది చెబుతు న్నారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ సచివాలయంలో తరచూ సాంకేతిక సమస్యలు పరి పాటైపోయాయని వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు వివిధ భాషల్లో శిక్షణ

టెక్కలి: విద్యార్థులు భవిష్యత్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు గాను అంత ర్జాతీయ బాషల్లో శిక్షణ ఇస్తున్నట్లు ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వర రావు తెలిపారు. శుక్రవారం కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ.. చైనా, జపాన్, కొరియా, జర్మన్ దేశాల బాషలపై ఆన్‌లైన్ విధానంలో నేర్చుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వృత్తి, ఉద్యోగ, వ్యాపారస్తులకు బీటెక్, ఎంటెక్, ఎంబీఏ కోర్సుల్లో చేరేందుకు కూడా అవకాశం లభించిందని, సెలవు రోజుల్లో లేదా సాయంత్రం వేళల్లో చదువుకునేందుకు ఈ అవకాశం కల్పిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 32 ప్రముఖ కంపెనీల్లో 620 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించాయన్నారు.

సాగునీటి కోసం కాలువ మరమ్మతులు

మందస: మందస మేజర్ పంచాయతీ పరిధిలోని జెన్నా చెరువు సాగునీటి కాలువకు సంబంధించి రెండు కిలోమీటర్ల మేర ఆయ కట్టు రైతులే స్వచ్ఛందంగా బాగు చేసుకున్నారు. గతంలో పూర్తి స్థాయిలో ఎటువంటి అభివృద్ధి చేపట్టకపోవడంతో పిచ్చి మొక్కలు, సిల్ట్ పేరుకుపోయింది. దీంతో రైతులే కాలువ బాగుకు ముందుకొచ్చారు. చత్రపురం వద్ద ఉన్న సునాముది ప్రధాన కాలువ నుంచి జెన్నా చెరువు కాలువకు నీరు ప్రవహించేది. ప్రస్తుతం కాలువలో పిచ్చి మొక్కలు పెరగడం, పాలకులు పట్టించుకోకపోవడంతో తప్పనిసరి పరి స్థితుల్లో రైతులంతా ఏకమై కాలువ మరమ్మతులు చేపట్టి ఖరీఫ్ సాగుకు సిద్ధం చేశారు.


జెన్నాచెరువులో పనులు చేపడుతున్న దృశ్యం

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి


కరపత్రం ఇచ్చి అవగాహన కలిగిస్తున్న ఉపాధ్యాయులు

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కిట్టాలపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం రాధాకృష్ణ కోరారు. శుక్రవారం గ్రామంలో ఇంటింటికి వెళ్లి పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సదుపాయాలను వివరించారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, షూష్ అందిస్తున్నామన్నారు.

రేపటి నుంచి శ్రీముఖలింగేశ్వరుని కల్యాణోత్సవాలు

జలుమూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలోని వారాహి సహిత శ్రీముఖలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు ఆదివారం నుంచి 21వ తేదీ వరకు 6 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. దీని నిమిత్తం ఏర్పాట్లు చేస్తున్నా మన్నారు. 16న ధ్వజారోహణం, 17న స్వామి కల్యాణం, నంది వాహనంపై పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవం, 18న అంకురార్పణ, అన్న ప్రసాద వితరణ, 19న పండిత సదస్యం, రుగ్వేద పారాయణం, 20న మైనకోత్సవం, 21న ముగింపు రోజున పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు పవిత్ర వంశధార నదిలో మంగళ స్నానాలు చేయించనున్నామన్నారు. భక్తులు కల్యా ణోత్సవాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.



దివ్యాంగులమంతా రుణపడి ఉంటాం

టెక్కలి: దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచడం ద్వారా తామంతా ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడుకు రుణపడి ఉంటామని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్ అన్నారు. దివ్యాంగులకు ఐదు శాతం రాజకీయ రిజర్వేషన్ కల్పించాలన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో టెక్క లి, సంతబొమ్మాళి, శ్రీకాకుళం మండ లాల సంస్థ అధ్యక్షులు పి.చంద్రశేఖర్, ఎర్రన్నాయుడు, తిరుపయ్య, మోహనరావు తదితరులున్నారు.

మత్స్యకారులకు న్యాయం చేయాలి

- మంత్రి అచ్చెన్నాయుడును కోరిన మత్స్యకార నాయకులు

సంతబొమ్మాళి: వైసీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు తీరని అన్యాయం జరిగిందని, వారికి న్యాయం చేసి ఆదుకోవాలని టీడీపీ మత్స్యకార నాయకులు సూరాడ ధనరాజ్, వారాధి చంటి, శ్రీరంగం రాజులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర మత్స్య, వ్యవసాయశాఖా మంత్రిగా నియమితులైన కింజరాపు అచ్చెన్నాయుడును శుక్రవారం విజయవాడలోని ఆయన స్వగృహంలో కలిసి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అచ్చెన్న నియామకంతో జిల్లాలోని మత్స్య కారులకు మంచి రోజులు వచ్చాయన్నారు. గత వైసీపీ ఐదేళ్ల పాలనతో వేట నిషేధ భృతి కూడా నిజమైన మత్స్యకారులకు అందలేదని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. మత్స్యకారులకు వలలు, బోట్లు సబ్సిడీపై అందలేదన్నారు. మత్స్యకారుల వేటకు గాను జిల్లాలో ఫిషింగ్ హార్బర్‌లను నిర్మించాలని వారు అచ్చెన్నాయుడును కోరారు.


అచ్చెన్నాయుడును అభినందిస్తున్న నాయకులు

ఐదు సంతకాలతో అన్ని వర్గాలకు న్యాయం

- అచ్చెన్నకు వ్యవసాయశాఖ కేటాయింపుపై హర్షాతిరేకాలు


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

టెక్కలి: టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడుకు రాష్ట్ర వ్యవసాయ, పాడి పరిశ్రమ శాఖా మంత్రిగా నియమించడంపై టీడీపీ శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తంచేశాయి. శుక్రవారం పార్టీ కార్యాల యంలో పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, మెగా డీఎస్సీ, సామాజిక పింఛన్ల మొత్తాన్ని పెంచడం, అన్న క్యాంటీన్ పునరుద్ధరణ, విద్యార్థుల నైపుణ్యం గుర్తింపునకు స్కిల్ సెన్సస్ ఫైళ్లపై సంతకాలు చేయడం శుభ పరిణామమన్నారు. అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. వ్యవసాయ, మత్స్యశాఖామంత్రిగా జిల్లా అభివృద్ధికి అచ్చెన్నాయుడు పాటుపడతారని ఆశాభావం వ్యక్తంచేశారు. సమావేశంలో నేతలు మట్ట పురుషోత్తం, లవకుమార్, పోలాకి చంద్రశేఖర్, మెండ దమయంతి, కోళ్ల కామేసు, బసవల అప్పలస్వామి, పోలాకి షణ్ముఖరావు, లాడి శ్రీనివాసరావు, గురువెల్లి బాలకృష్ణ, దోని బుజ్జి, మళ్ల బాలకృష్ణ, రెయ్యి ప్రీతీష్, దల్లి ప్రసాద్‌రెడ్డి, మల్లిపెద్ది మధు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన కలమట

శ్రీకాకుళం: రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఆ పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణ మూర్తి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉండవల్లిలోని ఆయన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.



స్వచ్ఛందంగా రక్తదానం చేయండి

పలాస: ప్రతి ఒక్కరు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కిడ్నీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ కోరారు. మొగిలిపాడు గ్రామానికి చెందిన ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 35 మంది రక్తదానం చేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు పిచ్చుక పాపారావు తెలిపారు. రక్తదాతలను డా.పద్మజ అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ కూన మోహన్ బాబు, సంస్థ సభ్యులు సానా ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావు, రాజు, మన్మథ, నరేష్, హేమసుందర్, ఉదయ్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదాతను అభినందిస్తున్న సూపరింటెండెంట్, వైద్యులు

సంక్షేమంతో పాలనకు శ్రీకారం: ఎమ్మెల్యే శిరీష

పలాస: గత వైసీపీ ప్రభుత్వం విధ్వంసంతో పాలన ప్రారంభిస్తే టీడీపీ సంక్షేమంతో ప్రారంభిం చిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే పనిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారని, తొలిరోజే ఐదు సంక్షేమ పథకాలపై సంతకాలు చేసి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారన్నారు. పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో ఉంచేందుకు ప్రతి ఒక్కరు కష్టపడాలని, త్వరలో దీనికి విధానాలు రూపొందించడం జరుగుతుందన్నారు. అంతకు ముందు శిరీషను వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పార్టీ నేతలు, కార్యకర్తలు కలిసి అభినందించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, నేతలు గాలి కృష్ణారావు, పీరుకట్ల విఠల్‌రావు, దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేమబాబుచౌదరి, యవ్వారి మోహనరావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, శంకర్, జోగ మల్లి, టంకాల రవిశంకర్ గుప్తా, మల్లా శ్రీనివాస్, శాసనపురి మురళీకృష్ణ, ఎం.నరేంద్ర, దానేటి పద్మిజి, కోనేరు ఆదినారాయణరావు, సూరాడ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిరీషకు అభినందన

హరిపురం/మందస: పలాస ఎమ్మెల్యేగా విజయం సాధించిన గౌతు శిరీషను హరిపురం కాష్యూ అసోసి యేషన్ సభ్యులు శుక్రవారం కలిసి అభినందించారు. దుశ్శాలువ, పుష్పగుచ్ఛాలిచ్చి సత్కరించారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. తమ సమ స్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాష్యూ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్ర రామారావు, సేనాపతి గురుమూర్తి, సానా శ్రీను, మల్లా నారాయణమూర్తి, నల్ల బాబూ రావు, నల్ల నరేష్, శ్రీధర్, కొత్ర ఆనందరావు తదితరులు పాల్గొ న్నారు. అలాగే ఎమ్మెల్యే గౌతు శిరీషను తహసీల్దార్ తిరుమల బాబు, డీటీ ఎం.కృష్ణమూర్తి తదితరులు కలిసి అభినం దించారు.


పలాస నియోజకవర్గ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు: పలాస ఎమ్మెల్యేగా ఎన్నికైన గౌతు శిరీషను తహసీల్దార్ సురేష్, డీటీ గిరిరాజు శుక్రవారం కలిసి అభినందించారు. శుక్రవారం ఆమె కార్యాలయంలో కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ పవిత్ర, సర్వేయర్ తిరుపతిరావు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, పలువురు రేషన్ డిపో డీలర్లు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం: రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు సూచించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, మండల పరిషత్ అధికారులతో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో ఎరువులు, పురుగు మందులను రైతులకు సకాలంలో అందించాలని, ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. గిరిజన రైతు లకు 90 శాతం రాయితీపై విత్తనాలను అందించాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణకై 2014 నాటి పద్ధతులు కొనసాగేలా చర్యలు చేపడతామన్నారు. ప్రతి గ్రామానికి తాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఎంజీఆర్‌ను వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛాలు, శాలువలతో సత్కరించి అభినందించారు. వారితో మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు.


వ్యవసాయశాఖాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

29న జాతీయ లోక్‌అదాలత్

- ఇన్‌చార్జి సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు

టెక్కలి: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ లోక్‌అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీపడేలా చూడాలన్నారు. రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్, సివిల్ కేసులను ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని, లోక్ అదాలత్ తీర్పు అంతిమమన్నారు. లోక్‌అదాలత్‌లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు ఇవ్వనున్నామన్నారు. దీనిని సద్వినియోగం చేసుకునేలా కక్షి దారులకు అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్‌హెచ్‌ఆర్ మళ్ల తేజా చక్రవర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, ఏపీపీ పి.వైకుంఠరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీనివాసరావు

ప్రొటెం స్పీకర్‌గా రాణేంద్ర ప్రతాప్

పర్లాకిమిడి: ఒడిశా శాసనసభ తాత్కాలిక (ప్రొటెం) స్పీకర్‌గా రాణేంద్ర ప్రతాప్ శుక్ర వారం ప్రమాణ స్వీకారం చేశారు. భువనేశ్వర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనతో గవర్నర్ రఘువర్‌దాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ప్రొటెం స్పీకర్ రాణేంద్రకు మంత్రివర్గ సభ్యులు అభినందించారు. కాగా ఈనెల 18, 19 తేదీల్లో ఎమ్మెల్యేలతో ఆయన ప్రమాణస్వీకారం చేయిస్తారు. అనంతరం స్పీకర్ ఎన్నిక జరుగుతుంది.


ప్రొటెం స్పీకర్‌ను అభినందిస్తున్న పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి

ప్రొటెం స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే రూపేష్

ఒడిశా రాష్ట్ర ప్రొటెం స్పీకర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రాణేంద్రప్రతాప్‌ను పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్‌కుమార్ పాణిగ్రాహి శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. వీరితో పాటు హైటెక్ విద్యాసంస్థల అధినేత తిరుపతి పాణిగ్రాహి ఉన్నారు.

ఒడిశా

ఘనంగా రజ్జో వేడుకలు

పర్లాకిమిడి: రాష్ట్రవ్యాప్తంగా రజ్జో వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. బాలికలు, మహిళలు, యువతుల ఆధ్వర్యంలో ఈ రజ్జో వేడుకలు ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంచుకుంటూ ఊయల్లో ఊగుతూ ఒకరినొకరు రజ్జో శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

దోమల నివారణకు పాటుపడండి

జలుమూరు: దోమల నివారణతోనే మలేరియా వ్యాధి రాకుండా అరికట్టవచ్చని మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, వైద్యాధికారి పి.గురునాథరావు అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా సైరిగాం గ్రామంలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి అవగాహన కలిగించారు. మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి హేమలత, ఆరోగ్యవిస్తరణాధికారి శిమ్మ సోమేశ్వరరావు, సబ్ యూనిట్ అధికారి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

జలుమూరు (సారవకోట): స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అధ్యక్షతన ఆదివారం ఉదయం 10 గంటలకు సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఆర్.రాంబాబు తెలిపారు. ఈ సమావేశానికి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సర్వసభ్య సమావేశానికి హాజరై విజయవంతం చేయాలన్నారు. అలాగే మండలస్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

మెగా డీఎస్సీ ప్రకటించడం శుభపరిణామం

- సీఎం చిత్రపటానికి నిరుద్యోగుల పాలభిషేకం

హిరమండలం: ఎన్నికల్లో నిరుద్యోగులకు ఇచ్చిన మెగా డీఎస్సీ హామీని సీఎంగా చంద్ర బాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన వెంటనే అమలు చేసే సంతకం చేయడం శుభపరిణామమని జడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు, నిరుద్యోగులు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం టీడీపీ నాయ కులు, నిరుద్యోగ ఉపాధ్యాయులు సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీఎస్సీపై తొలి సంతకంతో పాటు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, సామాజిక పింఛన్ మొత్తం పెంపు, నైపుణ్య గణన ఫైళ్లపై సంతకాలు చేసి అన్ని వర్గాల కు న్యాయం చేశారన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం వైపు పరుగులు పెట్టేందుకు ఇవి ఉదాహరణలన్నారు. కార్యక్రమంలో బర్రి సురేష్, కొర్రాయి రాము, ఎస్.జానికిరావు, దేవుదల వెంకటరావు, ఎస్.జగదీష్, టి.శ్రీనివాస రావు, రావాడ లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న నిరుద్యోగులు

నడిరోడ్డుపై హత్యాయత్నం

- యువకుడిపై కత్తితో దాడి
- రోడ్డుపై పరిగెత్తించి.. వెంటాడిన వైనం
- తప్పించుకుని పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలింపు


కత్తితో బొమ్మాళి గిరి


చికిత్స పొందుతున్న గౌరీశంకర్

శ్రీకాకుళం క్రైం, జూన్ 14: ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న సిక్కోలు నగరం గత కొన్నాళ్లుగా నెత్తుటి గాయాలతో అట్టుడికిపోతుంది. గూనపాలెంలో గొడ్డలి వేటుతో హత్యా ఉదంతం మరువక ముందే.. అదే ప్రాంతంలో ప్రియుడితో కలిసి భార్యే కిరాతకంగా భర్తను హతమార్చిన ఘటన చోటుచేసుకుంది. ఈ కేసులో అసలు నిందితుడు ఇంకా దొరకక ముందే బలగ హాస్పిటల్ రోడ్డులో పట్టపగలు నడిరోడ్డుపై ఓ వ్యక్తిని కత్తితో వెంటాడిన ఘటన నగరవాసులను ఉలిక్కిపడేలా చేసింది. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని గుడివీధి సమీపంలోని దమ్మల రెల్లివీధికి చెందిన నల్లపిల్లి గౌరీశంకర్ అనే 26 ఏళ్ల యువకుడు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో బలగ హాస్పిటల్ రోడ్డు సమీపంలో నివసిస్తున్న స్నేహితుడి వద్దకు తన బావ విజయకుమార్‌తో కలిసి ద్విచక్రవాహనంపై శంకర్ వెళ్లాడు. బలగ సచివాలయం వద్దకు చేరుకునే సరికి.. వీరి వెనుకే ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తూ కత్తితో దాడికి యత్నించాడు. దీన్ని గమనించిన విజయకుమార్ తన వాహనాన్ని వెనక్కి తిప్పేందుకు ప్రయత్నించగా.. దాడి చేయడానికి వచ్చిన వ్యక్తి తన వాహనాన్ని కింద పడేసి పరుగెత్తుకు వచ్చి గౌరీశంకర్‌పై కత్తితో దాడి చేశాడు. దీంతో శంకర్ తన ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీశాడు. ఈ క్రమంలో బలగ జంక్షన్‌కు చేరుకుని ఆటో ఎక్కి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులను ఆశ్రయించాడు. అక్కడ నుంచి పోలీసుల సాయంతో రిమ్స్‌కు వచ్చి చికిత్స తీసుకుంటున్నాడు.

పాత కక్షతోనే..

గౌరీశంకర్‌పై కత్తితో దాడి చేసిన వ్యక్తి డేఅండ్‌నైట్ కూడలి సమీపంలో ఉన్న రాయ్‌కాలనీ దగ్గర మందలవీధికి చెందిన బొమ్మాళి గిరిగా పోలీసులు గుర్తించారు. బాధితుడు శంకర్‌కి గిరి చెల్లెలు అనిత మంచి స్నేహితురాలు.. వీరి స్నేహం ప్రేమగా మారింది. ఇది గిరి కుటుంబ సభ్యులకు నచ్చకపోవడంతో శంకర్ దూరమవుతాడన్న బాధతో అనిత ఐదేళ్ల కిందట ఆత్మహత్య చేసుకుంది. ఈ నేపథ్యంలో శంకర్ వల్లే అనిత చనిపోయిందని ఆమె కుటుంబ సభ్యులు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. ఈ కేసులో శంకర్ గెలిచాడని, పెద్దమనుషుల సమక్షంలో కేసు సద్దుమనిగిందని శంకర్ చెబుతున్నాడు. అయితే అనిత సోదరుడు బొమ్మాళి గిరి మాత్రం శంకర్‌పై కక్ష పెంచుకుని.. ఇప్పుడు హతమార్చేందుకు ప్రయత్నించాడు. అయితే దాడి జరిగిన సమయంలో శంకర్ బావ విజయ్‌కుమార్ అడ్డుకోవడం, కత్తి పదునుగా లేకపోవడంతో శంకర్ ప్రాణాలతో బయటపడ్డాడు. అయితే ఈ దాడిలో శంకర్ ఎడమ చేతి మీద రెండు చోట్ల కత్తి గాట్లు కాగా, శంకర్ మొహంపై, మెడ మీద గాయాలయ్యాయి. శంకర్ ఎడమ చేయి వైపు స్పర్శ లేకపోవడంతో రిమ్స్ వైద్యులు చికిత్స అందిస్తున్నారు. తమకు ప్రాణ హాని ఉందని రక్షణ కల్పించాలని శంకర్ బావ విజయకుమార్ పోలీసులను కోరాడు. శంకర్‌పై హత్యాయత్నం జరిగిందన్న విషయం తెలుసుకున్న అతడి కుటుంబ సభ్యులు రిమ్స్‌కు చేరుకుని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న టూ టౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు బాధితుడి వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేశారు. కత్తితో దాడికి పాల్పడిన గిరి పరారీలో ఉండగా, అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన సీసీ కెమెరాల ద్వారా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం-సుర్లా రోడ్డు రైల్వేస్టేషన్ ట్రాక్ పూర్ణ థియేటర్ సమీపంలో గల రైల్వేట్రాక్ వద్ద గుర్తుతెలియని రైలు ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుని వయసు సుమారుగా 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుందని పలాస జీఆర్‌పీ ఎస్ఐ షేక్ షరీఫ్ తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్ఐ తెలిపారు.

టైరు పేలి డివైడర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు


మడపాం టోల్‌ప్లాజా వద్ద డివైడర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

నరసన్నపేట: మడపాం టోల్‌గేట్ వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సు ముందు టైర్ పేలి డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఆరుగురు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖ నుంచి ఇచ్ఛాపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు మడపాం టోల్ ప్లాజా వద్ద హైవేపై ముందు టైర్ పంక్చరై అదుపు తప్పింది. బస్సును కంట్రోల్ చేసే సమయంలో టోల్‌గేట్ వద్ద ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో పోలాకి చెందిన బి.విజయదుర్గారావు ముక్కుపై తీవ్ర గాయాలు కాగా మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నేషనల్ హైవే అంబు లెన్స్‌లో నరసన్నపేట సామాజిక ఆసుపత్రికి తీసుకువెళ్లగా.. ఆ సయమంలో వైద్యులు లేకపోవడంతో శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించా రు. స్వల్పంగా గాయపడ్డ వారికి ప్రథమ చికిత్స చేసి పంపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

నరసన్నపేట: ఉప్పరిపేట ఇసుక ర్యాంపు నుంచి అక్రమంగా నరసన్నపేటకు ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాకర్లను పట్టుకు న్నట్లు సెబ్ అధికారులు తెలిపారు. బుచ్చిపేట, చేనులవలస ఇసుక ర్యాంపుల నుంచి ట్రాక్టర్లు, లారీలతో అక్రమంగా లోడింగ్ చేపడుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఈబీ అధికారులు ట్రాక్టర్లను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు ఎస్ఈబీ ఎస్ఐ కావ్య తరలించారు. అయితే పట్టుకున్న ట్రాక్టర్లు ఇంటి నిర్మాణానికి ఇసుకను తరలిస్తున్నట్లు చెప్పడంతో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేయవద్దని చెప్పి ట్రాక్టర్ల విడిచిపెట్టారు. ఇదిలాఉండగా పట్టుకున్న ట్రాక్టరను ఎస్ఈబీ అధికారులు తమకు అప్పగించలేదని ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

శ్రీకాకుళం క్రైం: రూరల్ మండలం బైరి గ్రామ పరిధిలో శుక్రవారం లారీలో అక్రమంగా తరలిస్తున్న ఇసుకను సెబ్ సీఐ గోపాలకృష్ణ తన సిబ్బందితో పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు కాపుకాచి ఒక ఇసుక లోడ్ లారీ, రెండు ఖాళీ లారీలను పట్టుకున్నారు. వాటిని శ్రీకాకుళం రూరల్ పోలీసులకు అప్పగించగా.. ఎస్ఐ వాసుదేవరావు కేసు నమోదు చేశారు.

కిట్లన్నీ సకాలంలో చేర్చాలి

పొందూరు: ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న విద్యా ఉపకరణాలతో కూడిన కిట్లను ప్రభుత్వ పాఠశాలలకు సకాలంలో చేర్చాలని శ్రీకాకుళం డిప్యూటీ డీఈవో విజయకుమారి సూచించారు. మండల కేంద్రం పొందూరు ఎంఆర్‌సీలో తయారవుతున్న విద్యా ఉపకరణాల కిట్లను ఆయన పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా గడువులోగా కిట్లను చేర్చాలన్నారు. అనుమతి వచ్చిన తర్వాత విద్యార్థులకు కిట్లను అందించే లా ఏర్పాట్లు చేయాలని ఎంఈవో-2ను ఆదేశించారు.

శిథిలావస్థలో బ్రిటిష్ కాలం నాటి కల్వర్టు

- నిధులు మంజూరైనా చేపట్టని పనులు

గార: కె.మత్స్యలేశం పరిధిలో వాడపాలెం ఉప్పుగెడ్డపై బ్రిటిష్ కాలం నాటి కల్వర్టు శిథిలావస్థకు చేరింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు బీచ్ వరకు ఉంది. ఉప్పు గెడ్డ పై ఉన్న ఈ కల్వర్టు సముద్రపు గాలికి తొందరగా తుప్పు పట్టి పాడైపోయింది. ఈ కల్వర్టు శిథిలావస్థకు చేరిన విషయం పలుదఫాలుగా ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలకు ఆర్ అండ్ బీ అధికారులు అంచనాలు వేసి రూ.40 లక్షలు నిధులు మంజూరు చేయించారు. గత వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు సకాలంలో చెల్లింపులు జరగవన్న ఆందోళనతో ఆ కాంట్రాక్టరు కల్వర్టు పనులు చేపట్టలేదని తెలుస్తుంది. ఈ నేపథ్యంలో ఆ శాఖ అధికారులు పాత టెండర్ రద్దు చేస్తూ మళ్లీ కొత్తగా టెండర్లు పిలవనున్నట్టు తెలిసింది. ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం ఏర్పడడంతో ఈ సమస్య ఉండదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిత్యం వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉండే ఈ రోడ్డులో ఉన్న కల్వర్టు పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


వాడపాలెం వద్ద ఉప్పు గెడ్డపై ఉన్న కల్వర్టు దుస్థితి

18 నుంచి ఐటీఐ అడ్మిషన్ కౌన్సెలింగ్

- 2,470 మంది దరఖాస్తు

ఎచ్చెర్ల: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో వివిధ ట్రేడుల్లో చేరేందుకు ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 18వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు జిల్లా కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఒక ఏడాది, రెండేళ్ల వ్యవధి గల కోర్సుల్లో అడ్మిషన్లకు గాను ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సర్టిఫికేట్లు పరిశీలన పూర్తిచేసుకున్న అభ్యర్థులకు పదో తరగతి మార్కుల మేరకు ర్యాంకులు కేటాయించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. షెడ్యూల్ ప్రాప్తికి అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు నిర్దేశించిన తేదీల్లో హాజరు కావల్సిన వివరాలను వారి మొబైల్‌కు సమాచారం అందించామన్నారు. సీటు పొందని అభ్యర్థులకు తిరిగి ఈ నెల 25, 26 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, డ్రాఫ్ట్‌మన్ సివిల్ రెండేళ్ల కోర్సులు కాగా, వెల్డర్, మెకానిక్ డీజిల్, కటింగ్ అండ్ టైలరింగ్, కంప్యూటర్స్ ఏడాది కోర్సులని వివరించారు. జిల్లాలోని మూడు ప్రభుత్వ ఐటీఐల్లో 716 సీట్లు, 20 ప్రైవేట్ ఐటీఐల్లో 2,892 సీట్లు ఉన్నట్టు చెప్పారు.



ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ

కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలు

ఈ నెల 18న ఉదయం 1 నుంచి 193 ర్యాంకు వరకు (10 నుంచి 9.2 గ్రేడ్స్), మధ్యాహ్నం 194-413 వరకు (9.0 నుంచి 8.5 గ్రేడ్స్), 19న ఉదయం 414-648 ర్యాంకు వరకు (8.3 నుంచి 8.0 గ్రేడ్స్), మధ్యాహ్నం 649- 877 వరకు (7.8 నుంచి 7.4 గ్రేడ్స్), 20న ఉదయం 878-1144 వరకు (7.3 నుంచి 7.0 గ్రేడ్స్), మధ్యాహ్నం 1145-1399 ర్యాంకు వరకు (6.8-6.5 గ్రేడ్స్) కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. 21న ఉదయం 1400-1642 ర్యాంకు వరకు ((6.3-6.0 గ్రేడ్స్), మధ్యాహ్నం 1643-1873 ర్యాంకు (5.8-5.5 గ్రేడ్స్), 22న ఉదయం 1874-2083 ర్యాంకు వరకు (5.3-5.0 గ్రేడ్స్), మధ్యాహ్నం 2084-2305 ర్యాంకు వరకు (4.8-4.3 గ్రేడ్స్), 23న ఉదయం 2306-2470 ర్యాంకు వరకు (4.2-1.2 గ్రేడ్స్) వరకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరై సీటు పొందని వారు, నిర్దేశించిన తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకానివారికి ఈ నెల 25, 26 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. 25న ఉదయం 1-500 ర్యాంకు వరకు, మధ్యాహ్నం 501-1000 ర్యాంకు వరకు, 26న 1001-1600 ర్యాంకు వరకు మధ్యాహ్నం 1601-2470 వరకు ర్యాంకు పొందిన అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం: అగ్ని ప్రమాదాలను అవగాహనతో నివారించవచ్చని జిల్లా అదనపు అగ్నిమాపక అధికారి (ఏడీఎఫ్‌వో) ఎం.వరప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(రిమ్స్)లో శుక్రవారం వైద్యులతో పాటు సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఎఫ్‌వో వరప్రసాద్ మాట్లాడుతూ.. ప్రమాదం సంభవించినప్పుడు భయపడకుండా ప్రమాదాలు నివారించేందుకు ఆస్పత్రిలో అమర్చిన పరికరాలను వినియోగించి నివారించవచ్చునన్నారు. అగ్నిమాపక పరికరాలను ఎలా వినియోగించాలో వైద్య సిబ్బందికి చూపించారు. రిమ్స్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ పార్వతి, ఆర్ఎంవోలు సుభాషిని, భానుప్రకాష్, అగ్నిమాపక సిబ్బంది ఎల్ఎఫ్‌వో బీఎస్ నాయుడు, ఫైర్‌మన్స్ రామస్వామి, కోటేశ్వరరావు, కూర్మారావు పాల్గొన్నారు.

జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారు


ఎన్ఈఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ రఘువర్మ

రణస్థలం: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించిన జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల పాటు కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందన్నారు. అత్యధిక మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానన్నారు. బీజేపీ,టీడీపీ, జనసేన శ్రేణులు సమన్వయంతో పనిచేశారని గుర్తుచేశారు. సమావేశంలో కూటమి నాయకులు చౌదరి నారాయణ మూర్తి, ముప్పిడి సురేష్, బాడాన జన, లంక అప్పలనాయుడు, పిషిని జగన్నాథం, డీజీఎం ఆనందరావు, లంక ప్రభ, బెందు మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్ఈఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ

ఎచ్చెర్ల ఎమ్మెల్యేగా గెలిచిన నడుకుదుటి ఈశ్వరరావుకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పరిస్థితులపై ఇద్దరూ చర్చించారు. కాగా ఎమ్మెల్యే ఎన్ఈఆర్ క్యాంపు కార్యాలయం శుక్రవారం పార్టీ శ్రేణులతో కిటకిటలాడింది.

లక్ష్మారెడ్డి కుటుంబానికి డెత్ రిలీఫ్ ఫండ్ అందజేత

శ్రీకాకుళం క్రైం: బందోబస్తు విధులు ముగించుకుని తిరిగి శ్రీకాకుళం వస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ ఆబోతుల లక్ష్మారెడ్డి కుటుంబానికి శుక్రవారం జిల్లా పోలీసు అసోసియేషన్ తరుపున రూ.లక్ష డెత్ రిలీఫ్ ఫండ్‌ను అందజేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు అసోషియేషన్ సభ్యులు లక్ష్మారెడ్డి స్వగ్రామం పల్లిపేట వెళ్లి అతని భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అనంతరం రూ.లక్ష చెక్కును అతడి భార్య చంద్రకళావతికి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రోణంకి కృష్ణంనాయుడు, కె.భుజంగరావు, రాష్ట్ర అసోషియేషన్ సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎ.అరుణకుమారి, కార్యవర్గ సభ్యులు మీనాకుమారి, పోలాకి ఎస్ఐ సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలు.. రోగుల అవస్థలు


ఉక్కపోతతో సీహెచ్‌సీలో రోగులు అవస్థలు

ఇచ్ఛాపురం: అప్రకటిత విద్యుత్ కోతలతో శుక్రవారం స్థానిక సీహెచ్‌సీలోని రోగులు అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి ఎండతీవ్రతకుతోడు విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో చికిత్స పొందుతున్నవారు నరకం చూశారు. ఆసుపత్రిలో జనరల్ వార్డుతో పాటు గర్భిణులు ఉండే వార్డులో విద్యుత్ లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఆసుపత్రికి జనరేట్ సదుపాయం కూడా లేకపోవడంతో ఉక్కపోత కష్టాలు వారికి తప్పలేదు. చంటి పిల్లలతో మరీ ఇబ్బందిపడ్డారు. పట్టణ ప్రజలు కూడా ఉక్కపోతతో తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ గోవిందరావును వివరణ కోరగా.. పలాస విద్యుత్‌సబ్ స్టేషన్ నుంచి ఇచ్ఛాపురం సబ్‌స్టేషన్‌కు వచ్చే 130కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు జరుగుతున్నాయని, అందువల్లే ఇచ్ఛాపురంతోపాటు కవిటి, కంచిలి మండలాలకు సరఫరా నిలిచిపోయిందన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన

ఇచ్ఛాపురం: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రిమ్స్ బ్లడ్ బ్యాంక్ పర్యవేక్షణలో స్థానిక సీహెచ్‌సీలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం సీహెచ్‌సీలో నిర్వహించిన బ్లడ్ క్యాంప్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ పాతిర్ల దేవేంద్రరెడ్డి ప్రారంభించారు. 80మంది యువతీ, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువతీ యువకులుకు ధ్రువపత్రాలు డాక్టర్ దేవేంద్ర అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రమేష్, వెచ్చా సంతోష్, రిమ్స్ హౌస్ సర్జన్ నితిన్, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బలవంతంగా రాజీనామా చేయించారు


ఎమ్మెల్యేకు తమ బాధలు చెప్పుకుంటున్న మాజీ వలంటీర్లు

శ్రీకాకుళం క్రైం: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ నాయకులు తమను పావుల్లా వాడుకున్నారని, వారి ఒత్తిళ్లకు తలొగ్గి బలవంతంగా రాజీనామా చేశామని, మళ్లీ మాకు అవకాశం ఇవ్వాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు మాజీ వలంటీర్లు మొరపెట్టుకున్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో గొండు శంకర్‌ను వారంతా మర్యాద పూర్వకంగా కలుసుకుని తమ సమస్యను వివరించి, వినతి పత్రం అందజేశారు. దీనిపై గొండు శంకర్ స్పందిస్తూ న్యాయం చేస్తానన్నారు.

చేగువేరాను ఆదర్శంగా తీసుకోవాలి

ఆమదాలవలస: చేగువేరాను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పురపాలక సంఘ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా చేగువేరా జయంతి సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రపై విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్, పావని, చందు, హరీష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోవిందరావు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న మహోన్నత నేత చంద్రబాబు

ఆమదాలవలస: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న మహోన్నతమైన ముఖ్యమంత్రి చంద్రబాబు అని బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణితి విజయలక్ష్మీ బాయ్ అన్నారు. శుక్రవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. న్యాయవాదులు సాధు ధనుం జయరావు, తమ్మినేని అన్నంనాయుడు, బొడ్డేపల్లి మోహన్‌రావు, పైడి వరహానరసింహం, కింతలి త్రినాథరావు, గురుగుబిల్లి ప్రభాకరరావు పాల్గొన్నారు.


హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జాతీయ స్కాలర్‌షిప్‌కి నేహా ఎంపిక


నేహా

శ్రీకాకుళం కల్చరల్: అన్ని రంగాల్లో రాణించిన వారికి కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ద్వారా ఇచ్చే సీసీఆర్‌టీ స్కాలర్‌షిప్‌నకు కూచిపూడి నాట్య విభాగంలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన కుప్పిలి నేహా పట్నాయక్ ఎంపికయ్యారు. గత సంవత్సరం అక్టోబరులో ఈ స్కాలర్‌షిప్ ఎంపిక పరీక్షను హైదరాబాదు సీసీఆర్‌టీ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించగా.. అందులో రాష్ట్రం నుంచి కూచిపూడి విభాగంలో ఇద్దరు ఎంపికవ్వగా.. ఇందులో నేహా పట్నాయక్ ఒకరు. శ్రీకాకుళం నాట్యరంగ చరిత్రలో ఇప్పటి వరకు కేవలం నలుగురు మాత్రమే ఈ స్కాలర్‌షిప్‌ను దక్కించుకున్నారు. శ్రీకాకుళం నగరానికి చెందిన కుప్పిలి శివ, శ్వేతల కుమార్తె నేహా మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాలలో చదువుతోంది. నేహా ఎంపికపై నాట్య గురువు శ్రీకాంత్, ఆ స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

హామీలు నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి

అరసవల్లి: ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్షేమపాలన అందజేస్తారని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మాట ఇచ్చిన మేరకు.. ఐదు సంక్షేమ పథకాలపై చంద్రబాబు తొలి సంతకాలు చేసి మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు. ఈ మేరకు నగరంలోని స్థానిక విశాఖ-ఎ కాలనీలో గల తన కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. త్వరలో అన్న క్యాంటీన్ల ద్వారా లక్షలాది పేదల ఆకలి తీర్చనున్నామని, మేనిఫెస్టోలో చెప్పిన విధంగా హామీలన్నింటినీ కచ్చితంగా అమలు చేస్తారన్నారు. ఈ సందర్భంగా తనను కలిసేందుకు వచ్చిన అభిమానులు, కార్యకర్తలకు ఆయన స్వీట్లు పంచిపెట్టి అభినందించారు.

చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం


చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: పెన్షన్ పెంచిన సందర్భంగా బెల్లుపడ 12, 13, 14 వార్డులకు చెందిన పెన్షన్‌దారులు నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం జరిపారు. శుక్రవారం రాత్రి బెల్లుపడ గ్రామం గాంధీ మండపం వద్ద టీడీపీ నాయకుడు ఆశి చిరంజీవులు రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా జరిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గిన్ని చిన్న, ఆశి శ్రీధర్‌రెడ్డి, ఆశి మోహన్, మాజీ కౌన్సిలర్ టి.శ్రీనివాససాహు, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కలిశెట్టిని కలిసిన నాయకులు


ఎంపీతో మాట్లాడుతున్న అణువిద్యుత్ సిబ్బంది

రణస్థలం: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును శుక్రవారం పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా ఎంపీ కార్యాలయంలో కలిశారు. అదేవిధంగా కొవ్వాడ అణువిద్యుత్ ప్లాంట్‌కు సంబంధించిన సిబ్బంది కలిశెట్టిని ముచ్చటించారు. మండల కేంద్రంలో ప్రజా మరుగు దొడ్లు ఏర్పాటు చేయనున్నట్టు అణువిద్యుత్ సిబ్బంది తెలిపారు. అదేవిధంగా అధికారులు, నాయకుల తాకిడితో ఎంపీ కార్యాలయం కిటకిటలాడింది.

బాధిత కుటుంబానికి సాయం

ఇచ్ఛాపురం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకున్న పురుషోత్తపురం గ్రామానికి చెందిన గాలి కేశవరావుకు ఈడీఎఫ్ (ఎంప్లాయిస్ డ్రీం ఫౌండేషన్) సభ్యులు శుక్రవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10వేలు సాయాన్ని అందజేశారు. సంస్థ సభ్యులు ఎన్.సురేష్, గ్రామ పెద్దలు ప్రతాప్, ధర్మ పాల్గొన్నారు.

మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

ఆమదాలవలస: కాళింగ సామాజిక వర్గానికి చెందిన కూన రవికుమార్‌కు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని టీడీపీ మండల అధ్యక్షుడు నూకరాజు కోరారు. శుక్రవారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ జిల్లా పగ్గలు చేపట్టి వైసీపీ నిరంకుశ పాలనను ఎదురొడ్డి నిలిచారన్నారు. అందువల్ల అన్ని విధాలా అర్హత కలిగిన కూన రవికుమార్‌కు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని కోరారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బొడ్డేపల్లి గౌరీపతిరావు, టీడీపీ నాయకులు కె.వెంకటరమణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో-ద్విచక్ర వాహనం ఢీ

మెళియాపుట్టి: జోడూరు వద్ద శుక్రవారం ఆటో-ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారునికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చాపర గ్రామానికి చెందిన ఆటో పలాస నుంచి వస్తుండగా మెళియాపుట్టి నుంచి జాడుపల్లి వైపు వెళుతున్న ఒడియా రాష్ట్రం సిద్ధమడుగు గ్రామానికి చెందిన వ్యక్తి వెళుతుండగా.. ఎదురెదురుగా వస్తున్న ఆటో ద్విచక్ర వాహనం ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుని తలపై బలమైన గాయం కావడంతో టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్‌కు చిన్నపాటి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు వాహనాలను స్టేషన్‌కు తరలించి వివరాలు సేకరించారు.

ఆస్తి కోసం ఇరువర్గాల కొట్లాట

కొత్తూరు: హంస కాలనీలో శుక్రవారం ఆస్తి కోసం జరిగిన కొట్లాటలో ఇరువర్గాల వారికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. హంస కాలనీకి చెందిన దంత సింహాద్రి, రమణమ్మ మృతి అనంతరం స్థలం కోసం వారి వారసులుగా ఉన్నామంటూ మిన్నారావు కుటుంబం, వీలునామాగా వడ్డన ధర్మారావుకు స్థలాన్ని రాసి ఇచ్చారు. ఈ స్థలాన్ని ధర్మారావు సూర్యారావు అనే వ్యక్తికి విక్రయించాడు. ఈ నేపథ్యంలో మిన్నారావు, సూర్యారావు కుటుంబాలు వాదనకు దిగగా అది కాస్తా కొట్లాటకు దారి దీసింది. ఇరువర్గాల వారికి గాయాలు కాగా కొత్తూరు ఆసుపత్రికి తరలించారు. ఇరు కుటుంబాల ఫిర్యాదుల మేరకు కొత్తూరు ఏఎస్ఐ ఎంఏ అహ్మద్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శ్రీకాకుళం క్రైం: నగరంలోని పీఎన్ కాలనీ 6వ లైన్‌లో ఓ ఇంట్లో పేకాట నిర్వాహణ జరుగుతుందన్న సమాచారం మేరకు టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు సిబ్బందితో శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 10మంది పేకాటరాయుళ్లు పట్టుబడగా, రూ.36,700 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇంట్లో గత కొంతకాలంగా పేకాట నిర్వాహణ జరుగుతుందని, క్రికెట్ బుకీలు సైతం బెట్టింగ్‌లు ఇక్కడి నుంచే సాగించేవారని పోలీసులకు సమాచారం ఉన్నట్టు తెలుస్తుంది.

సీఎంను కలిసిన టీడీపీ నాయకులు

పొందూరు: రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబును శుక్రవారం మండల టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి ఇంటి వద్ద మండలానికి చెందిన జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గురాల సుమంత్ తదితరులు కలుసుకున్నారు.

వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

అరసవల్లి: జిల్లాలోని వివిధ షాపులకు వెళ్లి ఫాస్ట్ టాగ్ పేరుతో డబ్బులు వసూళ్లు చేస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని జిల్లా ఆహార నియంత్రణాధికారి కె.వెంకటరత్నం అన్నారు. అటువంటి వారు ఎవరైనా షాపులకు వచ్చి డబ్బులు వసూళ్లకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు. అనధికార వసూళ్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలా ఎవరైనా వసూళ్లకు వస్తే తక్షణమే జిల్లా ఆహార నియంత్రణాధికారి కె.వెంకటరత్నం 97040 09989కి ఫోన్‌లో సమాచారం అందించాలని కోరారు.

జీవో-117 రద్దు చేయాలి

సోంపేట: ప్రాథమిక స్థాయిలో మాతృభాష, ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష మీడియం నిర్వహించేలా జీవో నెంబరు 117ను రద్దుచేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు కోరారు. స్థానిక జడ్పీ ఉన్నతపాఠశాలలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ జీవోను వెంటనే రద్దుచేయాలని కోరారు. సమావేశంలో గొరకల శ్రీనివాసరావు, జి.ప్రకాశరావు, తెంబూరు కాళిదాసు, లక్కోజి రవికుమార్ ఉన్నారు.

పక్కాగా ప్రణాళిక అమలు చేయాలి

ఎచ్చెర్ల: ఎంఈవోలు, హెచ్ఎంలు, డీఆర్పీలు అందరూ విద్యాప్రవేశ్-90 రోజుల ప్రణాళిక పక్కగా అమలు చేయాలని సమగ్ర శిక్ష అకడమిక్ మోనటరింగ్ అధికారి గుంట లక్ష్మీనారాయణ తెలిపారు. ఎచ్చెర్ల ప్రాథమిక పాఠశాలను సమగ్ర శిక్ష ఏపీవో కె.నళినికాంత్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు ఎన్‌సీఆర్‌టీ, ఎస్‌సీఆర్‌టీ, సమగ్ర శిక్ష తదితర అధికార బృందాలు పర్యటించి విద్యార్థులకు ప్రాథమిక స్థాయి పరీక్షలు నిర్వహిస్తారన్నా రు. 90 రోజుల తర్వాత ఈ అంశంపై ఫైనల్‌గా ఓ పరీక్ష జరుగుతుందన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

అరసవల్లి: ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే యూనియన్ లక్ష్యమని ఏపీ హౌస్ యూనియన్ అధ్యక్షుడు రాయి బాబూరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఓ హోటల్‌లో యూనియన్ ఎన్నికలు.. జోనల్ కోఆర్డినేటర్ డి.సూరిబాబు, కన్వీనర్ల సమక్షంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా రాయి బాబూరావు, సెక్రటరీగా జి.రవికుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్.రంగారావు, వీకే సత్యనారాయణ, వి.గౌరినాయుడు, వి.రామకృష్ణ, అప్పారావు, వీణాకుమారి ఎన్నికయ్యారు.